క్లుప్తంగా

అభయాంజనేయం.. నామ పారాయణం



గాజులపేట(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గాజులపేటలో నూతనంగా ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి స్వామికి షోడసోప పర్వం పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి 16 మంది దంపతులు 16 బిందెలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం భజన భక్త బృందాలు నిర్వహించాయి.

ఆంధ్రోద్యమానికి పురిటి గడ్డ బాపట్ల

బాపట్ల అర్బన్ : ఆంధ్రోద్యమానికి ఆయుపట్టు లాంటి ఆంధ్ర మహా సభలకు బాపట్లలోనే అంకురార్పణ జరిగిందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు అన్నారు. ప్రథమాంధ్ర మహాసభలు 110వ వార్షికోత్సవం శుక్రవారం పట్టణంలోని టౌన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జి.రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1913 మే 26న బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ నాలుగు దశాబ్దాల ఆంధ్రోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆంధ్ర భాష గుర్తింపు కోసం పోరాడాలన్న పూనిక బాపట్లలోనే జరిగిందని కొనియాడారు. భాషా ప్రయుక్త రాష్ట్ర వాదనకు బాపట్లలోనే బీజం పడిందన్నారు. ముందుగా తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 'తెలుగు తల్లి' గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, వ్యవసాయ కళాశాల ఇంచార్జి ఏడీ విజయాభినందన, జనవిజ్ఞాన వేదిక నాయకుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, చిత్రకారుడు జీవీ బండికళ్ల బాబురావు, ఇనుపగోళ్ల రంగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు గాయాలు

కొల్లూరు: ద్విచక్ర వాహనం నుంచి పడి ఓ అంగన్‌వాడీ కార్యకర్తకు గాయాలయిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న నీరజ విధులు ముగించుకుని, స్కూటీపై ఇంటికి వెళ్తున్నారు. స్థానిక పెన్షనర్స్ భవనం వద్ద గురువారం వీచిన పెనుగాలుల ధాటికి వాలిన చెట్ల కొమ్మలను నరికించడంతో అవి పడి విద్యుత్తు తీగలు కిందకు జారాయి. ఆ విద్యుత్తు వైర్లు అంగన్‌వాడీ కార్యకర్త స్కూటీకి తగలడంతో అదుపుతప్పి కిందపడపోయింది. ప్రమాదంలో రెండు చేతులకు తీవ్ర గాయాలవడంతో వైద్య చికిత్స కోసం తెనాలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

2న 'కొల్లూరు' సర్వసభ్య సమావేశం

కొల్లూరు: కొల్లూరు మండల సర్వసభ్య సమావేశం వచ్చే నెల 2న, శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన ప్రభుత్వ శాఖల సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగ పిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుట కొరకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణం నుంచి అరవపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో విధించే కోతకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి

'గడప గడపకు' కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



చినపరిమి గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

చినపరిమి(వేమూరు): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు, సైడ్ కాల్వల ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. సచివాలయం నిధులతో రోడ్లు వేస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి ఆగకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. అభివృద్ధితో పాటు ప్రతి గడపలోకి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. పేద ప్రజలకు గూడు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ పని చేస్తున్నారని చెప్పారు. రాజధానిలో 51 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, ఇంతమందికి పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాజధానిలో పేదలు ఉండకూడదని చంద్రబాబు నాయుడు కుట్రలు పన్నారని, సామాజిక సమతుల్యత ఏర్పడుతుందంటూ అడ్డుపడ్డారని మండిపడ్డారు. పేదలకు ఎక్కడ లాభం చేకూరుతుందోనని చంద్రబాబు భయపడుతున్నారని చెప్పారు. రాజధానిలో పేద ప్రజలందరకు పట్టాలు పంపిణీ చేయడంతో సామాజిక పండగ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జూలాది రూబేను, సర్పంచ్ మేరుగ సుభాషిణి, ఆవుతు సాయిబాబారెడ్డి, తుమ్మా బసివిరెడ్డి, తుమ్మా పాముల రెడ్డి, ఆవుతు శివపార్వతి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గాదె శివరామకృష్ణారెడ్డి, పమిడికొండల రాజేష్ కుమార్, వుయ్యూరి అంజిరెడ్డి, అళ్ల సత్యనారాయణ రెడ్డి, కొల్లి వెంకట రెడ్డి, కుదేటి కృష్ణ మోహన్ రెడ్డి, పులివర్తి మోషే, వుయ్యూరి భాస్కర్ రెడ్డి, ఏసుబాబు, మద్రిరెడ్డి బసివి రెడ్డి, వెంకటరెడ్డి, చుండూరు గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, అళ్ల రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు

- కర్లపాలెంలో 11 పంచాయతీల వాలంటీర్లకు సన్మానం
- అవార్డులు అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కర్లపాలెం: గ్రామ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన వలంటీర్లకు వందనం సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేసి, అభినందించారు. కర్లపాలెం, ఏట్రవారి పాలెం, పాతనందాయపాలెం, కొత్త నందాయపాలెం, నల్లమోతువారి పాలెం, బుద్ధాం, యాజలి, దుండివారి పాలెం, దమ్మనవారిపాలెం, బోలాయపాలెం, నాగరాజుపాలెం గ్రామ పంచాయతీల పరిధిలోని వలంటీర్లు అవార్డులు అందుకున్నారు. కోన రఘుపతి మాట్లాడుతూ నవరత్నాల పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారని గుర్తుచేశారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలు అమోఘమైనవని కొనియాడారు. అవినీతి రహిత పాలనే ధ్యేయంగా గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. గ్రామాల్లో కులాలు, మతాలు, రాజకీయాలకతీతంగా అర్హులైన వారందరికీ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా ఆ పార్టీకి చెందిన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు, బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ డి.రాంబాబు, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, సర్పంచ్‌లు పులుగు గోవిందమ్మ, గురపసాల వెంకటేశ్వరమ్మ, అక్కల శ్రీనివాసరెడ్డి, కావూరి చిట్టెమ్మ, మల్లెల ఆదాము, ఎంపీటీసీలు తాండ్ర సాంబశివరావు, అక్కల వాణి, గొర్ల కమల, ఆసిఫ్‌అలీ, రాతంశెట్టి లక్ష్మణరావు, కోఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, యల్లావుల ఏడుకొండలు, సత్యనారాయణరెడ్డి, మందపాటి పరమానందకుమార్, కంకిపాటి నాగరాజు, ఆట్ల అయ్యప్పరెడ్డి, డి.రమేష్, శామ్యూల్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

బాపట్ల అర్బన్: వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన మరుప్రోలు వారిపాలెం సచివాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర చాలా కీలకమన్నారు. తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. సేవారత్న, సేవామిత్ర పురస్కారాలతో వలంటీర్లకు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మత్స్యకార సంఘం డైరెక్టర్ కోకిలగడ్డ చెంచయ్య, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గవినీ కృష్ణమూర్తి, ఒడ్డిముక్కల డేవిడ్, బొడ్డు సుబ్బారెడ్డి, నక్క వీరారెడ్డి, ఈఓపీఆర్డి పులిశరత్ బాబు, ఎంపీడీఓ ఎ.రాధాకృష్ణ, అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నేడు అవార్డు ప్రదానం

కర్లపాలెం: కర్లపాలెం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.రాంబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి చేతుల మీదుగా ఉదయం 10గంటలకు జరిగే కార్యక్రమంలో చింతాయపాలెం, గణపవరం, పెదపులుగు వారిపాలెం, నర్రావారిపాలెం, తుమ్మలపల్లి, పేరలిపాడు, పెదగొల్లపాలెం, పేరలి, సమ్మెటవారి పాలెం గ్రామ పంచాయతీల పరిధిలోని వలంటీర్లకు అవార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయం సిబ్బంది, కన్వీనర్లు హాజరవుతారని పేర్కొన్నారు.

అన్నదానానికి రూ.60వేలు విరాళం



నగదు అందజేస్తున్న ఆర్మీ విజయ్

బాపట్ల: నరసాయపాలెం గ్రామంలో మరియమ్మ తల్లి ఏసుక్రీస్తు స్వరూపాల ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానానికి ఎంపీటీసీ దేవరపల్లి రవికుమార్(ఆర్మీ విజయ్) శుక్రవారం రూ.60వేలు విరాళంగా అందజేశారు. శనివారం గ్రామంలో ఏసుక్రీస్తు, మరియమ్మ తల్లి స్వరూపాల ప్రతిష్ఠ మూడవ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ దాసి సుదర్శన్‌రావు తెలిపారు. ప్రజాసేవను కొనసాగిస్తానని ఆర్మీ విజయ్ తెలిపారు. గ్రామ పెద్దలు సతీష్, దేవరపల్లి చిలకయ్య, సిద్దయ్య బత్తుల ఏసయ్య, పూర్ణచంద్రరావు, శ్రీరామ్, గుడిపూడి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయవాది రవికుమార్‌కు అభినందన



మేకల రవికుమార్‌ను సత్కరించిన ఆర్యవైశ్య నేతలు

తెనాలి: దుబాయ్‌లో ఈ నెల 19–22 తేదీల్లో జరిగిన 'బెస్ట్ డిప్లొమాట్స్' అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొని వచ్చిన పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మేకల రవికుమార్‌ను శుక్రవారం ఆయన స్వస్థలంలో సత్కరించారు. కృత్రిమ మేధ అంశంపై జరిగిన సదస్సుకు 65 దేశాల్నుంచి 175 మంది ప్రతినిధులు పాల్గొనగా, భారతదేశం నుంచి హాజరైన అయిదుగురిలో మేకల రవికుమార్ ఒకరు. పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ నేతృత్వంలో స్థానిక కొణిజేటి రోశయ్య మార్గ్‌లోని ప్రైవేటు కార్యాలయంలో రవికుమార్‌ను శుక్రవారం సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించగలరన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. తనకు జరిగిన సత్కారానికి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు కొణిజేటి గోపీకృష్ణ, పెనుగొండ వెంకటేశ్వర్లు, ఎస్వీ బ్రహ్మం, కొల్లా గురునాథ గుప్త, ఆలపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ సరికొత్త ప్రయాణం



స్లీపర్ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

తెనాలి: ఆర్టీసీ తెనాలి డిపోలో నూతనంగా తెనాలి–హైదరాబాద్‌కు ప్రవేశపెట్టిన రెండు స్టార్ లైనర్ స్లీపర్ బస్సులను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన స్లీపర్ బస్సులు హైదరాబాద్ వెళ్లే ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉండగలవన్నారు. ముందుగా ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎమ్మెల్యే శివకుమార్‌కు స్వాగతం పలికారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన స్కూటీ

ప్రత్తిపాడు: స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు–1 సచివాలయం మహిళా పోలీస్ రజిని, గనికపూడి సచివాలయ మహిళా పోలీస్ భార్గవి శుక్రవారం అమరావతి రాజధానిలో జరిగిన సీఎం కార్యక్రమానికి బందోబస్తుకు వెళ్లి, తిరిగి మధ్యాహ్నం ప్రత్తిపాడుకు స్కూటీపై వస్తున్నారు. మార్గంమధ్యలో ఏటుకూరు సమీపంలో గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డు వెంబడి ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో రజిని, భార్గవీకి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా పోలీసులను పరామర్శించారు. చికిత్స నిమిత్తం వారికి పదివేల రూపాయలను అందించారు.

పేదలకు భోజనం పంపిణీ



బాపట్ల: బాపట్ల పట్టణంలోని గ్రీన్ పీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేదలకు భోజనం పంపిణీ చేశారు. శుక్రవారం ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పి.రత్నం ఆధ్వర్యంలో పేదలకు భోజనం, విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. సీహెచ్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఐకమత్యంతో తిరునాళ్ల జరుపుకోవాలి

పిట్టలవానిపాలెం: ఐకమత్యంతో తిరునాళ్ల జరుపుకోవాలని చందోలు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. కొత్తపాలెం గ్రామంలో జరుగుతున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల సందర్భంగా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ వివాదాలు లేకుండా ఐకమత్యంతో తిరునాళ్ల జరుపుకోవాలని సూచించారు. తిరునాళ్ల సందర్భంగా బందోబస్తు చేపట్టారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

వేమూరు: పాత గొడవల నేపథ్యంలో ఇరు కుటుంబాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో.. కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చోడయ్య తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. బలిజేపల్లి గ్రామంలో దొప్పలపూడి సుధాకర్, తోటు కూర ప్రశాంతి కుటుంబాల మధ్య గొడవలు నెలకొన్నాయి. గత పదిహేను రోజుల క్రితం సుధాకర్ కుమారుడు, ప్రశాంతి మధ్య గొడవలు జరగడంతో..కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో గురువారం బలిజేపల్లి గ్రామంలో తోటకూర ప్రశాంతి ఇంటిలో శుభకార్యం జరుగుతున్న క్రమంలో..మరోసారి దొప్పలపూడి సుధాకర్ కుటుంబం, ప్రశాంతి కుటుంబం మధ్య గొడవలు చేలరేగాయి. దీంతో ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. గాయపడిన వారు తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బలిజేపల్లి గ్రామం వెళ్లి, విచారించి ఇరువర్గాలపై కేసులు నమోదు చయడం జరిగిందని ఎస్‌ఐ చోడయ్య శుక్రవారం తెలిపారు.

'బడి'కి దూరం కాకుండా చేశారు ధన్యవాదాలు..



ఎంపీ మోపిదేవిని సత్కరిస్తున్న గ్రామస్తులు

రేపల్లె రూరల్: పాఠశాలల విలీనీకరణలో భాగంగా ఉయ్యూరువారిపాలెం ప్రాథమిక పాఠశాల రద్దుకాకుండా, కొనసాగే విధంగా ప్రత్యేక చొరవ చూపిన ఎంపీ మోపిదేవి వెంకట రమణారావుకు రుణపడి ఉంటామని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. పట్టణంలోని మోపిదేవి నివాసంలో శుక్రవారం ఆయనను కలిసి సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. తమ పాఠశాల పేరు విలీనీకరణ జాబితాలో ఉండటంతో ఎంపీని కలిసి సమస్యను విన్నవించామని గ్రామస్తులు తెలిపారు. పాఠశాల రద్దయితే విద్యార్థులు బేతపూడి వరకు కాలినడకన వెళ్లాల్సి ఉండటంతో..కొంత మంది పిల్లలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఎంపీకి వివరించినట్లు తెలిపారు. సమస్యపై ఆయన విద్యాశాఖ అధికారులతో మాట్లాడి పాఠశాల కొనసాగేవిధంగా కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు.

గృహాల నిర్మాణం వేగవంతం చేయాలి

ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి



టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్డీఓ, అధికారులు

రేపల్లె: పట్టణంలోని 18వ వార్డు వైఎస్సార్ జగనన్న కాలనీలోని గృహాల నిర్మాణం వేగవంతం చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ రంజిత్ బాషాతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి లబ్ధిదారు గృహం నిర్మించుకునేలా సచివాలయ ఉద్యోగులు చైతన్య పరచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు ఆర్డీఓ చెప్పారు. అదే విధంగా గృహ నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం, నగదు అంశాలను వివరంగా తెలియజెప్పాలన్నారు. నివేశన స్థలం పొంది డ్వాక్రా సంఘాల్లో ఉండే మహిళలకు అదనంగా మరో రూ.30వేల రుణం బ్యాంకుల నుంచి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని లబ్ధిదారులు సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విలియమ్స్, తహసీల్దార్ మల్లికార్జునరావు, కమిషనర్ విజయసారథి, ఎంపీడీఓ మల్లికార్జునరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ కార్యాలయాన్ని పట్టణంలో ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



తహసీల్దార్ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రేపల్లె: కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ కోరారు. పట్టణంలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తహసీల్దారు మల్లికార్జునరావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు లక్షలాది మంది ఈఎస్‌ఐ పరిధిలోకి వస్తున్నా, వారికి ఈఎస్‌ఐ వైద్య సేవలు అందడం లేదని తెలిపారు. వైద్యులు ల్యాబ్‌లు, అవసరమైన మందులు సమకూర్చి డిస్పెన్సరీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ కేంద్రంలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ సెంటర్ లేకపోవటంతో ఎటువంటి అనారోగ్యం సమస్యలు వచ్చినా ఈఎస్‌ఐ కవరేజ్ లేక ప్రైవేట్ హాస్పిటల్స్‌కి వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేయక తప్పటం లేదన్నారు. జిల్లా కలెక్టర్, కార్మికశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈఎస్‌ఐ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని తహసీల్దార్ మల్లికార్జునరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు వి.సుబ్బారావు, యు.రామకృష్ణ ప్రసాద్, నాంచారయ్య, కొండలు, మల్లేశ్వరరావు, అంకాలు, నరసింహ, రాంబాబు, సీఐటీయూ నాయకులు కె.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ట్రాఫికర్



చావలి బస్టాండ్ సెంటర్‌లో బస్సు వస్తే..



భట్టిప్రోలు స్టేట్ బ్యాంక్ వద్ద ఎదురుగా రెండు వాహనాలొస్తే..

- జఠిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
- అసలే ఇరుకు రోడ్లు ఆపై ఆక్రమణలు

భట్టిప్రోలు: అసలే ఇరుకు రోడ్లు, ఆపై ఆక్రమణలు, సింగిల్ రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు ఉండటంతో భట్టిప్రోలులో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు జఠిలమవుతోంది. ప్రధాన రహదారులు సింగిల్ రోడ్లు కావడంతో ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే తప్పుకోలేని పరిస్థితి నెలకొంది. అధికారులు, పోలీస్ శాఖ ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి, పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



రేపల్లె రూరల్: సాంప్రదాయాలను కాపాడటంతో పాటు హిందూ ధర్మాన్ని నిలబెట్టేందుకు సమరత సేవా ఫౌండేషన్ నిరంతరం పనిచేస్తుందని ఫౌండేషన్ జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో పోటుమెరక ఎస్టీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భగవంతుడిని ప్రజల చెంతకు చేర్చే ప్రయత్నంలో భాగంగానే ఎస్టీ కాలనీల్లో ఆలయాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, సహాయ కన్వీనర్ శొంఠి బాబూరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. వ్యక్తిపై కేసు నమోదు

బాపట్లటౌన్: మహిళపై దాడిచేసిన కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని హయ్యర్ నగర్‌కు చెందిన సలగల ఇందిరా.. దగ్గుమల్లి శేఖర్ అనే వ్యక్తి వద్ద రూ. 15 వేలు అప్పుగా తీసుకున్నారు. అప్పును విడతల వారీగా చెల్లిస్తున్నప్పటికీ గురువారం రాత్రి ఇంటికి వచ్చి శేఖర్ దౌర్జన్యం చేశాడని, తను, తన కుమారుడిపై దాడిచేశారంటూ ఇందిరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ రఫీ దగ్గుమల్లి శేఖర్‌పై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కర్లపాలెం: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు బాపట్ల సెబ్ సీఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. పెదగొల్లపాలెం గ్రామస్తుడు కాటూరి భాస్కరరావు అక్రమంగా కర్లపాలెం నుంచి మద్యం బాటిళ్లు పెదగొల్లపాలెం తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న సెబ్ పోలీసులు.. పెదగొల్ల పాలెం వద్ద కాపుకాసి అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 15 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.